జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం



హవేలిఘనపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

హవేలిఘనపూర్, చిన్నశంకరంపేట, నార్సింగి, రామాయంపేట, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శుక్రవారం హవేలిఘనపూర్, కూచన్‌పల్లి, చిన్నశంకరంపేట, సూరారం, నార్సింగి మండలం శేరిపల్లి, రామాయంపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. గత పాలకులు పదేళ్లలో మెదక్‌ను అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. మెదక్ చర్చి, పోచారం అభయారణ్యం, ఏడుపాయలను అభివృద్ధి చేస్తానని, జిల్లాలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొంటూర్ చెరువు కట్టపై మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. మెదక్ నుంచి తరలిపోయిన అన్ని కార్యాలయాలను తిరిగి తీసుకొచ్చేందుకు సీఎం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల తీసుకువస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు రూ.10వేల పంట రుణం తీసుకుంటే రుణమాఫీ జాబితాలో పేరు లేదని సూరారానికి చెందిన మహిళా రైతు పద్మ.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లింది. ఆయన స్పందిస్తూ. . సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్‌వో సురేష్ రెడ్డి, జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి, మెదక్ పీఏసీఎస్ ఛైర్మన్ హనుమంత్ రెడ్డి, తహసీల్దారు సింధూ రేణుక, ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్ తదితరులున్నారు.

రూ.5లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి



రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతా రెడ్డి

శివ్వంపేట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శివ్వంపేట మండలం ఉసిరికపల్లి కల్వర్టు వద్ద వాగులో కారు బోల్తాపడి మృతి చెందిన కుటుంబాలను శుక్రవారం ఆమె పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రైతు బీమా, ఇతర పథకాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. చంద్రాగౌడ్, మన్సూర్, సంతోష్ రెడ్డి, రమణాగౌడ్, యాదాగౌడ్, మహేందర్ రెడ్డి, లాయక్, తదితరులు ఉన్నారు.

21న రాయిలాపూర్‌కు శిక్షణ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి మండలం రాయిలాపూర్ గ్రామానికి ఈనెల 21న శిక్షణ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు వస్తున్నారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఎంపీవో కలీముల్లాతో కలిసి గ్రామంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. 21 నుంచి 24 వరకు గ్రామంలోనే ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకోవడంతోపాటు అభివృద్ధి పనులు, పరిపాలనపరమైన అంశాలను సైతం పరిశీలిస్తారని పేర్కొన్నారు. గ్రామస్థుల అభిప్రాయాలను తీసుకుంటారని తెలిపారు.

చెరువుల రక్షణకు చర్యలు

- హెచ్‌ఎండీఏ పరిధిలో సర్వే
- 4 మండలాల్లో దాదాపు పూర్తి

న్యూస్‌టుడే, నర్సాపూర్, తూప్రాన్:



తూప్రాన్‌లో పరిశీలిస్తున్న అధికారులు

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) పరిధిలోని జల వనరుల సంరక్షణకు పకడ్బందీ సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలో నర్సాపూర్, శివ్వంపేట, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తాయి. ఈ నేపథ్యంలో వీటి సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భావితరాలకు ఇవి చెరువులని చూపించాల్సిన దుస్థితి నెలకొంటుందని అంటున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లతో పాటు ఆక్రమణలనూ గుర్తిస్తున్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి చర్యలు తీసుకునేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

హెచ్‌ఎండీఏ పరిధిలో జల వనరులు

మండలం	వందెకరాలపైన	వందెకరాలలోపు	మొత్తం ఆయకట్టు
నర్సాపూర్	23	160	6,500
శివ్వంపేట	15	148	4,500
తూప్రాన్	10	170	2500
మనోహరాబాద్	06	114	1200

భూముల విలువ పెరిగి

2013లోనే హెచ్‌ఎండీఏ పరిధిలోని జలవనరుల సంరక్షణకు సర్వే జరిపించింది. ఆ సమయంలోనే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించింది. అయితే భూముల విలువ పెరిగాక అక్రమార్కులు రాత్రికి రాత్రి జలాశయాలను కబళించేస్తున్నారు. హెచ్‌ఎండీఏ పరిధి మండలాలు జంటనగరాల శివార్లలో ఉండటంతో ఇక్కడ స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. భూముల విలువ ఆకాశాన్నంటడంతో తటాకాలను రక్షించే చర్యలు ప్రారంభమయ్యాయి.

ఆక్రమణల అంతు తేల్చేనా...

గడిచిన పదేళ్లలో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకోవడం, కాళేశ్వరం కాల్వలు, జాతీయ రహదారుల నిర్మాణం, సంగారెడ్డి కెనాల్‌కు భూసేకరణ, ప్రాంతీయ రింగ్ రోడ్డుకు భూసేకరణ వంటి వాటితో హెచ్‌ఎండీఏ పరిధి మండలాల్లో భూముల విలువ ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎకరం భూమి రూ.కోట్లల్లో పలుకుతుండగా జల వనరులపై అక్రమార్కులు కన్నేశారు. భవనాలు, నిర్మాణాలు చేపట్టారు. నీటి వనరుల రక్షణకు అధికారులు కదలడంతో ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు సర్వేతో ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ శాఖలోని లొసుగులు, నీటిపారుదల, పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో చాలా చెరువుల్లో శిఖం, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతుల్లేకుండానే నిర్మాణాలు చేపట్టారు. పదేళ్లలో రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వ్యక్తులు స్థిరాస్తి వ్యాపారంలోకి దిగడం, వారికి అండగా ఉండటంతో ఈ క్రతువు యథేచ్ఛగా సాగింది. ఈ విషయాన్ని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా సర్వే దాదాపు పూర్తి కావచ్చిందన్నారు.

రూపం కోల్పోయి..

హెచ్‌ఎండీఏ పరిధిలోని జల వనరుల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తున్న ప్రభుత్వం హైడ్రాను అంతటా విస్తరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో దాని పరిధి మండలాల్లోని చెరువులు, కుంటలను సర్వే నిర్వహిస్తోంది. నీటిపారుదల శాఖ, రెవెన్యూ సర్వేయర్లు కలిసి సర్వేను కొనసాగిస్తున్నారు. నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, జయచంద్రారెడ్డిలు పర్యవేక్షిస్తున్నారు. గతంలో నిర్వహించిన సర్వే ఆధారంగా పరిశీలిస్తే చాలా వరకు జలవనరులు రూపం కోల్పోయి ఉన్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. పెద్ద ఎత్తున ఆక్రమణలు వెలుగు చూస్తున్నాయి. ఇదివరకే ప్రాథమికంగా నోటిఫికేషన్ జారీచేసింది. రెవెన్యూ రికార్డులు, శాటిలైట్ మ్యాపులను పరిగణనలోకి తీసుకుని సర్వే చేస్తున్నారు. ఆక్రమణలకు గురైనప్పటికీ గతంలో ఆయా చెరువుల పూర్తి నిల్వ సామర్థ్య ప్రాంతం ఎక్కడి వరకు ఉందో మార్కింగ్ చేస్తున్నారు. చాలా వాటికి ఈ ప్రక్రియ పూర్తయ్యింది.

అందుబాటులోకి న్యాయ సేవలు



అల్లాదుర్గంలో నూతనంగా కోర్టు ఏర్పాటు చేయనున్న భవనం

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కోర్టు ఏర్పాటు కల నెరవేరనుంది. ఇప్పటివరకు అందుబాటులో లేకపోవడంతో కేసుల నిమిత్తం దూర ప్రాంతాలైన మెదక్, జోగిపేట, సంగారెడ్డి ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. శనివారం కోర్టు ఏర్పాటు కానుండటంతో ఆ సమస్యలు తీరనున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అల్లాదుర్గం రెవెన్యూ సబ్ డివిజన్ ఏర్పడిన నుంచి కోర్టు ఏర్పాటు కోసం స్థానికులు చేసిన పోరాటం సత్ఫలితాలను ఇచ్చింది. ఎస్సీ బాలికల వసతిగృహంలో తాత్కాలికంగా జూనియర్ సివిల్ జడ్జి ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయనున్నారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి పర్యటన

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి నేడు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లాదుర్గంలో కోర్టు కాంప్లెక్స్ ప్రారంభోత్సవం, ఏడుపాయల అమ్మవారి దర్శనం, మెదక్‌లో నిర్వహించే బార్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదగడమే లక్ష్యం



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న డీఈవో రాధా కిషన్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎదగాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లాస్థాయి వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-17 బాలుర విభాగంలో శివ్వంపేట మండలం ప్రథమ, మెదక్ మండలం ద్వితీయ స్థానంలో నిలువగా, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నర్సాపూర్ మండలం, ద్వితీయ స్థానంలో శివ్వంపేట మండల నిలిచింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మాధవ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వినోద్ కుమార్, మధుసూదన్, చంద్రమోహన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తపస్ జిల్లా మహిళా విభాగం ఎన్నిక

మెదక్: తపస్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా జంగిటి స్వరూపారాణి, ప్రధాన కార్యదర్శిగా రేఖ సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.



స్వరూపారాణి



రేఖ సుజాత

20న ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో జట్ల ఎంపికలు

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామ రాజు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఈనెల 20వ తేదీన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి ఖోఖో జూనియర్స్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ మహేందర్ రావు, సభ్యులు పోచప్ప, నాగరాజులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి ఎంపికలు జరుగుతాయని చెప్పారు.

వైద్య సలహాలకు టోల్‌ఫ్రీ నంబరు

నర్సాపూర్, న్యూస్‌టుడే: మానసికంగా ఆందోళన చెందుతున్న వారు టోల్‌ఫ్రీ నంబరు 14416ను ఉపయోగించుకోవాలని, తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ సృజన సూచించారు. నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ప్రపంచ హోస్పైస్ పాలియేటివ్ కేర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నంబరుకు ఫోన్ చేయవచ్చని, తద్వారా వైద్యుల సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

నర్సాపూర్‌లో అదనపు జూనియర్ సివిల్ కోర్టు



నూతన కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న అనిత

నర్సాపూర్: నర్సాపూర్‌లో నూతనంగా అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేస్తున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం పాత భవనంలో ఏర్పాటు చేసేందుకు ముస్తాబు చేస్తున్నారు. పనులను న్యాయమూర్తి అనిత, బార్ అసోసియేషన్ ప్రతినిధులతో కలసి శుక్రవారం పరిశీలించారు. నూతన కోర్టును ఈనెల 26వ తేదీన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సీనియర్ న్యాయవాదులు అంజిరెడ్డి, ఎక్బాల్‌అలీ జాఫర్, శంకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, శ్రీనివాస్, ఆనంద్ తదితరులున్నారు.

న్యాయమూర్తికి పదోన్నతి

నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.అనిత.. సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆమెను దేవరకొండ సివిల్ కోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. న్యాయమూర్తి అనితను న్యాయవాదులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.

పోటీ.. సృజనాత్మకతతో మేటి

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

పోలీసు అమరుల సంస్మరణ ఉత్సవాల నేపథ్యంలో ఆ శాఖ పలు పోటీలకు తెర తీసింది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వేదికగా ఎంతో మంది చిన్న వీడియోలు, చిత్రాలు తీస్తూ తమ సృజనాత్మకతను చాటుకుంటుంటారు. ఇలాంటి వారి ప్రతిభను వెలికితీయడమే ధ్యేయంగా పోలీసు శాఖ ఈ పోటీలను నిర్వహిస్తోంది.



తాజాగా తీసినవి..

పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఆ శాఖ కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ఫొటో, వీడియోగ్రాఫర్లు, విద్యార్థులతో పాటు పోలీసులకు పోటీలు చేపడుతోంది. పోలీసుల త్యాగాలను, విధుల్లో ప్రతిభను చాటేలా తాజాగా తీసిన 3 చిత్రాలు, 3 నిమిషాల నిడివి ఉన్న లఘుచిత్రాలను పెన్‌డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి పోలీసు శాఖ జిల్లా కార్యాలయంలోని పీఆర్వోకు అందించాలి. వాటి నుంచి బాగున్నవి ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

ఏయే అంశాల్లో..

మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో రక్షకుల సేవ, ఇతర సందర్భాల్లో వారి కీర్తి ప్రతిష్ఠలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు ఇలా లఘుచిత్రాలకు అంశాలుగా నిర్దేశించారు. గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు తీసిన లఘుచిత్రాలను మాత్రమే పోటీలకు ఈ నెల 20 లోపు పంపించాల్సి ఉంటుంది.

అంతర్జాలంలో వ్యాసరచన

ఇంటర్ వరకు విద్యార్థులకు విచక్షణతో కూడిన చరవాణి వినియోగం, డ్రగ్ ఆపై వారికి మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అంశాలపై అంతర్జాలం వేదికగా వ్యాసరచన పోటీలు ఉంటాయి. అక్టోబరు 25 లోపు పంపించాలి.

పోలీసు సిబ్బందికి..

కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు సమాజంలో పోలీసు ప్రతిష్ఠ మెరుగుపరచడంలో నా పాత్ర, ఎస్సై నుంచి పై స్థాయి అధికారులకు దృఢమైన శరీరంలో దృఢమైన మనసు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో రాయవచ్చు.

త్యాగాలను స్మరిస్తూ..: అనూరాధ, సిద్దిపేట సీపీ



అమరులైన పోలీసుల త్యాగాలను స్మరిస్తూ ప్రతి ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాం. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేస్తాం.

ఫుట్‌బాల్‌లో రాణించేలా.. జాతీయస్థాయిలో ఆడేలా..

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడేలా తీర్చిదిద్దడమే ఇండియా ఖేలో ఫుట్‌బాల్ (ఐకేఎఫ్) లక్ష్యం. సౌత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీతో కలిసి ఆటగాళ్ల ఎంపికకు పోటీలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో తొలిసారిగా ఈ నెల 19న మెదక్ ఇందిరాగాంధీ స్టేడియంలో మెదక్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపడుతోంది. హైదరాబాద్, ముంబయి, బెంగళూర్, కోల్‌కతా, చెన్నై, దిల్లీ వంటి ప్రధాన పట్టణాల్లోనే ఈ తరహా ఎంపికలు జరిగాయి. రాష్ట్రంలో మెదక్‌లో (శనివారం), వరంగల్‌లో (నవంబర్ 3న) జరుగనున్నాయి.

శిక్షణ ఇచ్చి..

ప్రోత్సాహం లేక రాణించలేకపోతున్న పట్టణాలు, గ్రామాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో ఈ ప్రక్రియ చేపట్టారు. దేశంలోని ప్రముఖ అకాడమీల్లో తర్ఫీదు పొందవచ్చు. విదేశీ అకాడమీలలోనూ చేరవచ్చు.

ఎంపిక తీరు..

మూడు దశల్లో ఎంపికలు కొనసాగుతాయి. తొలి దశలో మెదక్, వరంగల్ జిల్లాల్లో పోటీలు జరుగుతాయి. ప్రతిభ చూపిన వారిని రెండో దశ రీజనల్ స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ పోటీలను బెంగళూర్‌లో నిర్వహించనున్నారు. మెరుగైన ఆట చూపిన వారిని మూడో దశ (జాతీయ స్థాయి)లో ఆడే అవకాశం దక్కుతుంది. ఇవి న్యూదిల్లీలో జరుగుతాయి.

పారితోషికం..

శిక్షణ సమయంలో విద్యాభ్యాసం కొనసాగించవచ్చు. పారితోషికం సైతం చెల్లిస్తారు. పలు క్లబ్‌లకు ఆడిస్తూనే, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఆడేలా తీర్చిదిద్దుతారు. ఉమ్మడి మెదక్, సమీపంలోని జిల్లాలకు చెందిన అండర్-13, 15, 17 బాలబాలికలు ఇందులో పాల్గొననున్నారు.

తొలిసారిగా..



జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లను తీర్చిదిద్దే లక్ష్యంతో మూడేళ్లుగా ఐకేఎఫ్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు చేపడుతున్నాం. తొలిసారిగా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వారికి సైతం ఈ తర్ఫీదు అందించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నాం.

విష్ణుతేజ, సౌత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీ సహ వ్యవస్థాపకుడు, హైదరాబాద్



మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియం

సదవకాశం:

ఫుట్‌బాల్‌లో రాణించాలనుకునే వారికి సదవకాశం. ప్రముఖ అకాడమీలలో ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా శిక్షణ పొందే అవకాశం దక్కుతుంది. తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడవచ్చు. **ప్రకాశ్, మెదక్ ఫుట్‌బాల్ అకాడమీ శిక్షకుడు**


మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



శంకర్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఎలుకపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్ఐ సాదాత్‌మియా తెలిపిన వివరాలు.. ఎలుకపల్లికి చెందిన కానికే శంకర్(22) తల్లి గతంలో మృతి చెందడంతో తండ్రి వెంకటేశ్.. దుర్గమ్మను పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో ఏడాది క్రితం వెంకటేశ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్ తన పినతల్లి దుర్గమ్మ వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సమస్యలపై దుర్గమ్మతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శంకర్ రాత్రి 11 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు అన్ని చోట్ల వెతికినా జాడ దొరకలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెంది ఉండడం గ్రామస్థులు గమనించారు. శంకర్ సోదరి శైలజ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.


కుటుంబ కలహాలతో మరొకరు..



రాజు

గుమ్మడిదల, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన వల్లపు రాజు(35) కొన్నాళ్లుగా గుమ్మడిదలలో అద్దె ఇంట్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండేళ్ల కిందట ఆయనకు గుమ్మడిదల మండలం మంబాపూర్‌కు చెందిన లక్ష్మీతో రెండో వివాహమైంది. ఇటీవల కుటుంబ కలహాలు చెలరేగాయి. భార్యతో గొడవ జరగడంతో ఆయన మామ రాజు ద్విచక్ర వాహనం తీసుకెళ్లాడు. దీనికి మనస్థాపానికి గురైన రాజు శుక్రవారం మధ్యాహ్నం ఆయన సోదరుడు మహేశ్‌కు ఫోన్‌చేసి బాధగా మాట్లాడారు. తదుపరి పక్కింటి వారు ఫోన్‌చేసి రాజు ఇంట్లో ఉరి వేసుకున్నాడని చెప్పడంతో ఆయన సోదరుడు, తల్లి మల్లమ్మ వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అనుమానాస్పద స్థితిలో యువవకుడి మృతి



శివసాయి

మెదక్ రూరల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన పట్టణంలోని అవుసులపల్లిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన నాగారం రాజయ్య, లక్ష్మి కుమారుడు శివసాయి(23) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటున్నాడు. రాజయ్య సుమారు 20ఏళ్ల క్రితం మృతి చెందడంతో తల్లి పోషిస్తోంది. గురువారం రాత్రి తల్లి లక్ష్మి, ఆమె అక్క భర్త రవి, కుమారుడు శివసాయి మద్యం తాగారు. తర్వాత రవి వారి ఊరికి వెళ్లిపోయాడు. కొంతసేపటికి కుమారుడు లేడని చుట్టుపక్కల వారికి చెప్పి వెతికింది. రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూస్తే అతను గడ్డి పక్కన గాయాలతో పడి ఉన్నాడు. వెంటనే స్థానికులు మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. తల్లే చంపిందని బంధువులు, గ్రామస్థులు ఆరోపించారు. తల్లి, ఆమె అక్కపై గ్రామస్థులు దాడికి ప్రయత్నించడంతో పోలీసులు ఇద్దరినీ ఠాణాకు తరలించారు. కేసు నమోదైంది.

ప్రమాదవశాత్తు నీటమునిగి ఒకరి మృత్యువాత



గణేష్

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన ప్రకారం.. రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన బేగరి గణేష్(45) రెండు రోజుల క్రితం బహిర్భూమికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. చెరువు వద్ద చూసినా ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. శుక్రవారం మధ్యాహ్నం మృతదేహం చెరువులో నీటిపై తేలింది. గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నరసమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

వరికోత వాహనం ఢీకొని చిరువ్యాపారి..

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: వరికోత వాహనం ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన మెదక్ మండలంలోని మంబోజిపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా గుండారం గ్రామానికి చెందిన షేక్ ఆరీఫ్ గత ఏడాది ఇక్కడికి వచ్చి నివాసం ఉంటున్నాడు. మంబోజిపల్లి మార్కెట్ వద్ద బజ్జీల బండి పెట్టుకుని కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. శుక్రవారం అక్కడే బండి పెట్టుకోగా వెనుక నుంచి వచ్చిన వరికోత వాహనం ఢీకొనడంతో కిందపడిపోయాడు. అతన్ని భార్య మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. డ్రైవర్ కాశ్మీర్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుల్తానా బేగం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గేదెను తప్పించబోయి రైతు దుర్మరణం

చిలప్‌చెడ్: గేదెను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి రైతు దారబోయిన వీరేశం(49)మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మిస్బొద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం.. వీరేశం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా చిట్కుల్ గ్రామ శివారులో దారిపైకి ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో దానిని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. దీంతో వీరేశం తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

మా ఊరికి మహాలక్ష్మి వచ్చింది!



సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం గుడుపల్లి, ఔరంగ్‌నగర్, గౌసాబాద్ తదితర గ్రామాల మీదుగా నడిచే ఆర్టీసీ బస్సు ఐదేళ్ల కిందట నిలిచిపోయింది. సరైన ఆదాయం రాకపోవడంతో సంబంధిత అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలు కర్ణాటక రాష్ట్రానికి చెందిన బస్సు ఎక్కేవారు. లేదంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ క్రమంలో గురువారం జహీరాబాద్‌లో పర్యటించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి డా. ఏ.చంద్రశేఖర్ మొగుడంపల్లి మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. జహీరాబాద్ డిపో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో శుక్రవారం బస్సు సర్వీసును షురూ చేశారు. పదమూడు గ్రామాల ప్రజలకు ఊరట దక్కింది. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు రాకపోకలు సాగించనుంది. ఇక మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకునే అవకాశం చిక్కింది.

- న్యూస్‌టుడే, మొగుడంపల్లి (జహీరాబాద్ అర్బన్)

కాటేసిన కాలువ

ఆరు నెలల్లోనే నీటిలో పోయిన తండ్రి, కుమారుడి ప్రాణాలు



యాదగిరి

గజ్వేల్ గ్రామీణ: ఆరు నెలల క్రితం కుమారుడు కాలువలో ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు కోల్పోగా.. ఇప్పుడు తండ్రి అందులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. వరుస విషాదాలతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. సీఐ సైదా తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దాతర్‌పల్లి- రిమ్మనగూడ మధ్యలోని కొండపోచమ్మ జలాశయం కాలువలో వ్యవసాయ కూలీ గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. దాతర్ పల్లి కి చెందిన నాయిని యాదగిరి (40)కి భార్య వాణి, కుమార్తె ఉన్నారు. యాదగిరి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం కాలువలో మృతదేహం తేలింది. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చాటుగా ప్రేమ వివాహం.. వరుడి ఇంటిపై దాడి

రాయపోల్, న్యూస్‌టుడే: ప్రేమ వివాహం చేసుకున్న యువకుడి ఇంటిని పాక్షికంగా ధ్వంసం చేసిన ఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం టెంకంపేటలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఏఎస్ఐ రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన యువకుడు (19), యువతి (20) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. అక్కడ వారికి పరిచయం ప్రేమగా మారింది. కులాలు వేరు కావడం, యువకుడికి చట్టప్రకారం పెళ్లీడు వయసు రాకపోవడంతో వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. ఈనెల 17న హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు వెళ్లి వివాహం చేసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా రాయపోల్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరూ వచ్చారు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు.. వరుడి ఇంటికి వెళ్లి పెంకులు, రేకులు ధ్వంసం చేశారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

21న డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన



హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: డీసెట్ ర్యాంకు సాధించి పలు కారణాలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాని అభ్యర్థులకు ఈ నెల 21న హవేలిఘనపూర్‌లోని జిల్లా విద్యా శిక్షణా సంస్థలో తిరిగి పరిశీలన ప్రక్రియ చేపడుతున్నట్లు డైట్ ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. అభ్యర్థులు ర్యాంకుకార్డు, డైట్ సెట్ హాల్‌టికెట్, పది, ఇంటర్ మార్కుల మెమోలు, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు బోనఫైడ్లు, ఇంటిగ్రేటెడ్ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ప్రత్యేక విభాగాల ధ్రువపత్రాలు (ఎన్‌సీసీ, స్పోర్ట్స్, దివ్యాంగులు, సైన్యంలో విధులు) తీసుకురావాలని సూచించారు. ఈ నెల 23 నుంచి 26 వరకు మీ సేవా కేంద్రాల్లో వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలని, వీలైనన్ని ఎక్కువ కళాశాలలు ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. 30న సీట్లు కేటాయిస్తామని, నవంబరు 3లోపు ప్రవేశం పొంది, ఫీజు చెల్లించాల్సి ఉంటుంది, 4న కేటాయించిన కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో చేరాల్సి ఉంటుందని వివరించారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



మమత

పుల్కల్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి చెందిన ఘటన చౌటకూరు మండల హొన్నాపూర్ వద్ద శుక్రవారం జరిగింది. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపిన ప్రకారం మండలంలోని గంగోజిపేటకు చెందిన కాశపాగ మమత (30)కు ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. కొన్ని రోజులుగా భర్తకు దూరమై పుట్టింట్లో ఉంటోంది. సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్‌ఆర్ ఆసుపత్రి భోజనశాలలో హెల్పర్‌గా పని చేస్తోంది. మూడు రోజుల కిందట ఇంటి నుంచి విధులకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. శుక్రవారం హొన్నాపూర్ జాతీయ రహదారి పక్కన శవమై కనిపించింది. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరి పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పాములన్నీ ప్రమాదకరం కాదు



సర్పాన్ని ప్రదర్శిస్తూ వివరిస్తున్న ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సభ్యులు

ములుగు, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ' ఆధ్వర్యంలో శుక్రవారం పాములపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విష సర్పాలు, విషంలేని సర్పాలను గుర్తించడం, పాము కాటుకు ప్రథమ చికిత్స చేయడాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో అటవీ కళాశాల పరిశోధన కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎస్.ఎస్.శ్రీనిధి మాట్లాడుతూ సమాజంలో సర్పాలంటే అందరికీ ఎంతో భయం ఉంటుంది. పాములన్నీ ప్రమాదకరమైనవి కాదని, కొన్ని మాత్రమే విషపూరితమైనవన్నారు. అనేక రకాల సర్పాలు పంటలను నాశనం చేసే ఎలుకలు, ఇతర కీటకాలను తిని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ రైతులకు మేలు చేస్తున్నాయన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ పోటీల్లో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుబ్బాక, న్యూస్‌టుడే: పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు మూడు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్.బుచ్చిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆరు విభాగాల్లో జరిగిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థులు ఎ.చామంతి ఏకపాత్రాభినయంలో, సీహెచ్ యశ్వంత్ వాద్య సంగీతంలో, క్రాంతి కుమార్ చిత్రలేఖనంలో ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గైడ్ టీచర్లను ఎంఈవో ప్రభుదాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

నలుగురిలో దూషించాడని.. మద్యం తాగించి మిత్రుడి హత్య



వివరాలు వెల్లడిస్తున్న చేర్యాల సీఐ శ్రీను, పక్కన మద్దూరు ఎస్సై మహబూబ్

చేర్యాల(మద్దూరు), న్యూస్‌టుడే: మహిళలు సహ పలువురి ఎదుట అవమానకరంగా దూషించడంతో కోపం పెంచుకున్న మిత్రుడు కక్ష పెంచుకొని మద్యం తాగించి హత్య చేశాడు. సిద్దిపేట జిల్లా ధూల్మిట్ట మండలం కూటిగల్ శివారులో ఈనెల 15న అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి (48) కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం మద్దూరు ఠాణాలో జరిగిన సమావేశంలో చేర్యాల సీఐ ఎల్.శ్రీను వివరాలు వెల్లడించారు. ఈనెల 14న బెక్కల్‌కి చెందిన బైరగోని లక్ష్మి మద్దూరు స్టేషన్‌లో తన భర్త యాదగిరి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ మరుసటి రోజే కూటిగల్ శివారులో యాదగిరి మృతదేహం లభ్యమైంది. హత్యకు గురైనట్లు నిర్ధారించుకొని మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి ఎస్సైలు మహబూబ్, నీరేశ్, రాజు ఆధ్వర్యంలో మూడు బృందాలు దర్యాప్తు చేశాయి. బైరాన్‌పల్లికి చెందిన నందనబోయిన బాలకృష్ణను అనుమానితుడిగా భావించి, అతని కోసం గాలిస్తుండగా శుక్రవారం మద్దూరు మండలం ఉప్పరోనిగడ్డ శివారులో పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈనెల 13న బెక్కల్‌లో అవమానిస్తూ యాదగిరి తిట్టడంతో బాలకృష్ణ కోపం పెంచుకున్నాడు. అంతుచూడాలని భావించిన బాలకృష్ణ.. అదే రోజు సాయంత్రం యాదగిరిని బైక్‌పై తీసుకెళ్లి మద్యం తాగించాడు. మత్తులో ఉండగా కర్రతో తలపై బాది హత్య చేశాడు. బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. కేసు ఛేదించిన ఎస్సైలను, సిబ్బందిని సీఐ అభినందించారు. సీసీ కెమెరాలు ఉండటంతో కేసు ఛేదనకు తోడ్పడ్డాయని తెలిపారు.

బంగారు బాల్యానికి.. పంచసూత్రం!

● అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యాచరణ

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట, మెదక్, తాండూరు

నేటి బాలలు.. రేపటి భావిభారత పౌరులు. బంగారు భవితకు బాటలు పడేది ప్రాథమిక దశలోనే. ఈ తరుణంలో వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆయా సేవలకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. వివిధ రూపాల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నా పోషణ లోపంతో పలువురు బాధపడుతున్నారు. వారిని సంపూర్ణ ఆరోగ్యులుగా తీర్చిదిద్దే క్రతువులో భాగంగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో చిన్నారుల అభ్యున్నతికి పంచసూత్రాల అమలుకు శ్రీకారం చుట్టడం విశేషం.

	ప్రాజెక్టులు	అంగన్‌వాడీ కేంద్రాలు
సంగారెడ్డి	5	1,504
మెదక్	4	1,076
సిద్దిపేట	5	1,150
వికారాబాద్	5	1,107

మార్పు తీసుకొచ్చే లక్ష్యంతో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 9, వికారాబాద్ జిల్లాలో 5 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో 4,837 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. చిన్నారులకు అధిక పోషకాలున్న బాలామృతం అందిస్తున్నారు. ఎవరికైనా పోషణ లోపం ఉంటే వారిని వైద్యుల వద్దకు తీసుకెళ్తున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తూ మార్పు తెస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాల వారిని గుర్తించి పూర్వప్రాథమిక స్థాయి విద్యను అందిస్తూ.. కావాల్సిన ఆహారం సమకూర్చుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పక్కాగా అమలుచేస్తున్నాం: లలిత కుమారి, జిల్లా సంక్షేమాధికారిణి, సంగారెడ్డి

చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పంచసూత్రాలు పక్కాగా అమలయ్యేలా చూస్తున్నాం. పోషణలోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం.

పంచసూత్రాలు ఇలా..

1000 రోజుల ప్రణాళిక

జిల్లాల్లో పోషణ లోపం కలిగిన చిన్నారులపై ప్రత్యేక కార్యక్రమం. 1000 రోజుల పాటు ఇది కొనసాగుతుంది. చిన్నారుల్లో మార్పునకు అవసరమైన చర్యలు తీసుకుంటారు.

పౌష్టికాహారం తినడం

చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలకు పోషణలోపమే ప్రధాన కారణం. బాల్యదశలో సమతుల ఆహారం అందించకపోతే ఎదురయ్యే ఇబ్బందులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించడంతో పాటు ఇంటి వద్ద కూడా ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలియజేస్తున్నారు.

రక్తహీనత నివారణ

పలువురు చిన్నారుల్లో రక్తహీనత సమస్య తలెత్తుతోంది. ఇలాంటి వారిని గుర్తించి.. పౌష్టికాహారం అందిస్తారు.

డయేరియాకు దూరంగా..

కలుషిత నీరు, ఆహారం తదితర కారణాలతో చిన్నారులు డయేరియా బారినపడుతున్నారు. ఫలితంగా శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. నిర్లక్ష్యం వహిస్తే పరిస్థితి చేయిదాటే ప్రమాదం లేకపోలేదు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, ఒకవేళ అతిసారం బారినపడితే ముందడుగు వేయాల్సిన తీరుపై సూచనలు చేస్తున్నారు.

శుచి, శుభ్రత

శుచి, శుభ్రత పాటించకపోతే రోగాలు ప్రబలే ఆస్కారం ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికం. చేతుల శుభ్రతతో ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులు తరచూ చేతులను శుభ్రం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

బాలిక హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

సదాశివపేట: బాలిక హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సెషన్ జడ్జి జి.భవానీచంద్ర శుక్రవారం తీర్పు ఇచ్చారు. సదాశివపేట సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ఇబ్రహింపల్లి గ్రామానికి చెందిన వీరేశం భార్య కల్పన మూడేళ్ల కూతురు భవ్యతో కలిసి గతంలో ప్రసవానికి షాబాద్ మండలం బోడపహాడ్ గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. అక్కడ రాజు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అక్కడే ఉండిపోయింది. కాన్పు అనంతరం చిన్నకూతురు, పెద్ద కూతురు భవ్య, ప్రియుడితో కలిసి సదాశివపేట పట్టణం ప్రియదర్శిని కాలనీకి మకాం మార్చారు. తమతో ఉంటున్న భవ్య తనను నాన్న అని పిలవడంలేదని రాజు ఆగ్రహంతో చిన్నారిని గోడకు కొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన 26 ఫిబ్రవరి 2019లో జరిగింది. ఈ విషయం తండ్రి వీరేశానికి తెలియడంతో కూతురు మరణంపై అనుమానం ఉందని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ కల్పన, రాజుపై కేసు నమోదు చేసి విచారించగా, నిందితులు నేరం అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి యావజ్జీవ ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించండి



చిన్నారుల బరువును పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమాధికారి హైమవతి

చేగుంట, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమాధికారి హైమవతి అన్నారు. మండలంలోని కర్నాల్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు ఉండేలా అంగన్‌వాడీ టీచర్లు చూడాలన్నారు. కేంద్రాల్లో పౌష్టికాహారం లభిస్తుందని గర్భిణులు, బాలింతలు అక్కడకు వెళ్లి భోజనం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో పలు వీధులను పరిశీలించారు. ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో ప్రశాంత్ తదితరులున్నారు.

పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయురాలి ఔదార్యం



ప్రధానోపాధ్యాయుడికి చెక్కు ఇస్తున్న ఉపాధ్యాయురాలు వసంత

చేగుంట: వడియారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వసంత బడి అభివృద్ధి కోసం రూ.లక్ష ప్రకటించారు. తక్షణ సాయంగా రూ.25 వేల చెక్కును ప్రధానోపాధ్యాయుడు సిద్దిరాములుకు శుక్రవారం అందించారు. పాఠశాలలో 'మన ఊరు.. మన బడి' కింద నిర్మాణం చేపట్టిన శౌచాలయాలు అసంపూర్తిగా ఉన్నాయి. బాలబాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి అవస్థలను గుర్తించిన వసంత రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. దీంతో ఆమెను అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

ప్రభుత్వాసుపత్రికి పెరిగిన రోగుల తాకిడి

నిత్యం 500 మందికి వైద్య సేవలు



మందుల కోసం గుమికూడిన జనం

న్యూస్‌టుడే, తూప్రాన్: తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. చిన్న పెద్ద వయస్సుతో సంబంధం లేకుండా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. తూప్రాన్ 50 పడకల ఆస్పత్రికి నిత్యం 500 మందికి పైగా ప్రజలు వైద్య సేవల కోసం వస్తున్నారు. 24గంటల పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. దీంతో తూప్రాన్, శివ్వంపేట, వెల్దుర్తి, చేగుంట, మనోహరాబాద్ మండలంతో పాటు సిద్దిపేట జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన ప్రజల సైతం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి సేవలు పొందుతున్నారు. ప్రధానంగా ఇటీవల వర్షాలు పడడంతో వాతావరణంలో మార్పులతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు.

పడకలన్నీ నిండుగా:

ప్రజలు, చిన్నారులు విష జ్వరాలతో బాధపడుతూ ఉండడంతో వైద్య సేవల కోసం వచ్చేవారిని ఇన్ పేషెంట్లుగా చేర్చుకొని వైద్యం అందిస్తున్నారు. గత కొంత కాలంగా ఇన్ పేషెంట్ల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఆస్పత్రిలోని పడకలన్నీ నిండిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో డిశ్చార్జ్ అయ్యేంత వరకు పలువురికి సాధారణ సేవలు అందించి తర్వాత ఇన్ పేషెంట్లుగా చేర్చుకుంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఎక్కువ మంది విష జ్వరాలతో బాధ పడుతున్నారని వైద్య అధికారులు పేర్కొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

– డాక్టర్ అమర్‌సింగ్, తూప్రాన్ ఆస్పత్రి పర్యవేక్షకుడు

గత కొన్ని నెలలుగా తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రధానంగా విష జ్వరాలు విజృంభిస్తుడడంతో వయసుతో తేడా లేకుండా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులందరికి మెరుగైన వైద్యం చేసేందుకు కృషి చేస్తున్నాం. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యులు, సిబ్బందితో ఎప్పటికప్పుడు అన్ని సేవలు అందిస్తున్నాం.

వైద్య పరీక్షలకు వరుస కట్టి

తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలోనే వివిధ రకాలైన వైద్య పరీక్షలు నిర్వహిస్తుండడంతో నిత్యం 200మందికి పైగా పరీక్షలు చేస్తున్నారు. ఓపీలో వైద్య సేవలు పొందిన వారిలో అవసరమైన వారికి వైద్యులు పరీక్షలు రాస్తుండగా ఆయా రోగ నిర్ధారణ పరీక్షలు చేసుకునేందుకు రోగులు బారులుదీరుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆస్పత్రికి వచ్చే వారికి, పరీక్షలు అవసరం ఉన్న వారందరికీ నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మెదక్, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్‌లో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక గీతా ఉన్నత పాఠశాలలో 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు-సోషల్ మీడియా ప్రభావం' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు సుమంత్, సిరివెన్నెల, దీక్షిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి తమ సత్తా చాటారు. విజేతలకు ప్రిన్సిపల్ రవికుమార్ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, శంకర్, రాజు, లక్ష్మణ్ సునీత తదితరులు పాల్గొన్నారు.



బహుమతి పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ రవికుమార్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: టీఎన్జీవో



మాట్లాడుతున్న నరేందర్

మెదక్, న్యూస్‌టుడే: ఉద్యోగులకు రావాల్సిన ఐదు విడతల కరవు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల అన్ని రకాల బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. డిజిటల్ పంట సర్వే నిమిత్తం వ్యవసాయ విస్తరణ అధికారులకు సహాయకులను నియమించాలన్నారు. టీఎస్ జీఎల్ఐ కార్యాలయాన్ని సంగారెడ్డి నుంచి మెదక్‌కు తరలించాలని తీర్మానం చేశారు. జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనూరాధ, జిల్లా సహా అధ్యక్షులు ఇక్బాల్ పాష, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫణిరాజ్, ఫజలుద్దీన్, రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, కిరణ్ కుమార్, రాధా, బాధ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింలు, గోపాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: డీఎస్సీ ద్వారా నియామకమై కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి బోధన అందించి తమ సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు హనుమన్నగారి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మానేపల్లి పాఠశాలలో విధుల్లో చేరిన నలుగురు ఉపాధ్యాయులను గ్రామస్థుల సమక్షంలో నరేందర్‌రెడ్డి వారిని సన్మానించారు. వెల్దుర్తి ఉమ్మడి మండలంలో కొత్తగా 11 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు.

టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం

పెద్దశంకరంపేట: టీపీటీఎఫ్ పెద్దశంకరంపేట మండల కార్యవర్గాన్ని శుక్రవారం ప్రాథమిక పాఠశాలలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి హీరాలాల్, పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంగయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా టీ.మారుతి, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్‌సమి, ఉపాధ్యక్షులుగా బేతయ్య, సుగుణ మణి, సాయిబాబా, కార్యదర్శులుగా భార్గవ్, రాధిక, మౌనిక, జిల్లా కౌన్సిలర్‌గా ఎన్.విజయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా సంగమేశ్వర్, రాజేశ్వర్‌లను ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ అర్బన్: అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారిణి మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు, ఆంగ్లం, వృక్షశాస్త్రం (ఉర్దూ మీడియం), పెద్దశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు పోస్టు ఖాళీగా ఉన్నాయి. అర్హులైన వారు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 23వ తేదీ లోపు జిల్లా ఇంటర్ నోడల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్ రేపు

మెదక్ అర్బన్: సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్-యూనిటీ కప్ నిర్వహించనున్నట్లు సత్య సాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శిరిగ ప్రభాకర్ తెలిపారు. పట్టణ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వేదికగా 4 జట్లు తలపడనున్నట్లు చెప్పారు. సాయిబాబా, శివసాయికృష్ణ, లక్ష్మీ ప్రసన్న, రుక్మిణి, కరుణ తదితరులున్నారు.

మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం

చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేటలో శుక్రవారం మండల మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనాన్ని మధు, నాగరాజు, రఘురాములు, రామకృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘం అభివృద్ధి, భవిష్యత్తులో చేసే పనులపై చర్చించారు.

మంచినీటి కొరత రానివొద్దు



సహాయకులకు ధ్రువపత్రాలను అందిస్తున్న ఈఈ సంపత్

కౌడిపల్లి: గ్రామాల్లో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా కృషి చేయాలని మిషన్ భగీరథ జిల్లా ఈఈ సంపత్ సూచించారు. శుక్రవారం కౌడిపల్లి రైతువేదికలో గ్రామ మంచి నీటి సహాయకుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరిగిన శిక్షణలో వివిధ అంశాల గురించి నేర్పించామని, నాణ్యమైన నీటి సరఫరాకు కృషి చేయాలన్నారు. నీటి సరఫరాలో మంచినీటి సహాయకులదే కీలక పాత్ర అన్నారు. నిధుల కొరత ఉన్నందున పంచాయతీలలో ఉన్న నిధులను బట్టి పైప్‌లైన్ల మరమ్మతులు ఇతరత్రా పనులు చేసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నర్సాపూర్ సబ్ డివిజన్ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి నీటి సరఫరాలో సమస్యలు తెలుసుకుంటామన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న సహాయకులకు ఈఈ చేతుల మీదుగా ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. మండల ఇంఛార్జి ఏఈ అన్వేష్‌రెడ్డి, నాణ్యతా విభాగం ఏఈ సుష్మా, మాస్టర్ శిక్షకులు బాలరాజు తదితరులున్నారు.

మూఢనమ్మకాల అడ్డుకట్టకు విద్యార్థులకు అవగాహన

చేగుంట: మూఢనమ్మకాలపై విద్యార్థినులకు సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ శుక్రవారం అవగాహన కల్పించారు. చేగుంటలోని తెలంగాణ గిరిజన బాలికల క్రీడా పాఠశాల, కేజీబీవీలో మహిళల రక్షణ, మూఢ నమ్మకాల నిర్మూలపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ సుమతి, ఎస్వో శ్రీవాణి తదితరులున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ పథకాలు

శివ్వంపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పిల్లుట్ల గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో

రామాయంపేట: దరఖాస్తులు వచ్చిన ధరణి సమస్యను వెంటనే పరిష్కరించాలని, కార్యాలయానికి వచ్చి వారితో సిబ్బంది మర్యాద పూర్వకంగా మాట్లాడాలని ఆర్డీవో రమాదేవి సూచించారు. శుక్రవారం పేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. .ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, ఈ విషయమై ప్రచారం నిర్వహించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. త్వరలో జరగబోయే గ్రూప్-3 పరీక్ష కోసం స్థానికంగా ఉన్న కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. తహసీల్దార్ రజని తదితరులున్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

శివ్వంపేట, న్యూస్‌టుడే: ఉసిరికపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగ్య తండా, భీమ్లా తండాలకు చెందిన మృతుల కుటుంబాలను భాజపా రాష్ట్ర నాయకుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ శుక్రవారం పరామర్శించి రూ.5వేల చొప్పున సాయం అందించారు.

చెక్కుల అందజేత

కొల్చారం, చిన్నశంకరంపేట: ఎనగండ్ల గ్రామానికి చెందిన వీరేశంకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే సునీతారెడ్డి హైదరాబాద్ తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. దరిపల్లికి చెందిన నరసింహారెడ్డికి రూ.40వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకుడు పుల్లారావు బాధితుడికి అందించారు.

ఆర్వో ప్లాంటు ఏర్పాటు అభినందనీయం

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులకు మంచినీటి ఇబ్బందులు తీర్చేందుకు స్ట్రీట్‌కాజ్ వాటర్ ప్రాజెక్ట్ సంస్థ ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఈవో డి.వెంకటేశం అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట జడ్పీ పాఠశాలలో నీటి ప్లాంటును ఆయన ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ తదితరులున్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలిని కలిసిన అధికారులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సుహాసినిరెడ్డిని కౌడిపల్లిలోని ఆమె నివాసంలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ అధికారులు, పాలకులు కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు. నరేందర్‌రెడ్డి, శంకర్ తదితరులున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

తూప్రాన్, న్యూస్‌టుడే: తూప్రాన్ పురపాలికల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని పురపాలిక ఛైర్‌పర్సన్ జ్యోతి కృష్ణ అన్నారు. శుక్రవారం పురపాలికలోని పలు వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో పనులు చేసేందుకు చొరవ తీసుకుంటామన్నారు. 16 వార్డులో మురుగు కాల్వల నిర్మాణ పనులను కౌన్సిలర్ నారాయణగుప్తా పరిశీలించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏను వెంటనే మంజూరు చేయాలని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పంతులు రాజు అన్నారు. శుక్రవారం పాపన్నపేటలో ఆయన మాట్లాడుతూ. .ఉద్యోగులకు ఐదు డీఏలు రావాల్సి ఉందని, సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఇబ్బంఉదలు పడుతున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు వెంకట్రామిరెడ్డి, లింగప్ప, తదితరులున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో నవగ్రహ దేవాలయ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు శుక్రవారం కొనసాగాయి. పూజారి హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, నవగ్రహాలకు అభిషేకాలు, హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

సకాలంలో బస్సులు నడపాలని రాస్తారోకో



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై బాలరాజు

రామాయంపేట: సకాలంలో బస్సులు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ నాయకుడు ప్రశాంత్ అన్నారు. ఈ విషయమై మండల పరిధి అక్కన్నపేటలో రామాయంపేట-మెదక్ ప్రధాన రహదారిపై శుక్రవారం విద్యార్థులతో కలిసి గంటపాటు బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఖాజాపూర్, శాలిపేట్, ఝాన్సీలింగాపూర్ గ్రామాల నుంచి పాఠశాల, కళాశాలకు వచ్చే విద్యార్థులకు సకాలంలో బస్సులు లేవని వాపోయారు. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పి పంపారు. అధికారులకు వినతి పత్రం అందజేయాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



కుసంగిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

టేక్మాల్: ప్రతి రైతు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం సీఈవో వెంకటేశం సూచించారు. శుక్రవారం టేక్మాల్ మండలం కూసంగి, చల్లపల్లి, శేరిపల్లి గ్రామాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. మండలంలో వరి ఆరబోత యంత్రం అందుబాటులో ఉందన్నారు. సహకార సంఘం మండలాధ్యక్షుడు మొగులయ్య, జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు యూసుఫ్, నాయకులు సంగమేశ్వర్ ఉన్నారు. రేగోడ్ మండలం మర్పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని సీసీ కిష్టయ్య ప్రారంభించి మాట్లాడారు.

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై భాజపా ఆందోళన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: గ్రామసభలు లేకుండా ఏకపక్షంగా ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల ఏర్పాటును నిరసిస్తూ శుక్రవారం కౌడిపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట భాజపా శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, తాలూకా కన్వీనర్ రమణారావు, భాజపా రాష్ట్ర నాయకులు మల్లేశ్‌గౌడ్, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మహిపాల్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఎస్సీ మోర్చా తాలుకా కన్వీనర్ రాజు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్, భాజపా మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బాల్‌లింగం భాజపా శ్రేణులు పాల్గొన్నారు.

వ్యక్తి పైకి దూసుకెళ్లిన కారు

రామాయంపేట, న్యూస్‌టుడే: మద్యం మత్తులో రహదారిపై పడి ఉన్న ఓ వ్యక్తిపై కారు దూసుకెళ్లిన ఘటన రామాయంపేటలో శుక్రవారం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి మద్యం మత్తులో పట్టణంలోని సిద్దిపేట చౌరస్తాలో పడి ఉన్నాడు. అదే సమయంలో ఓ కారు అటువైపు మరలుతూ అతనిపైకి దూసుకెళ్లింది. దీంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు, స్థానికులు ప్రాథమిక చికిత్స కోసం పేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన ఎల్లయ్యగా గుర్తించారు.

ప్రాణాంతక దారులు.. ప్రమాదకర మలుపులు



మంగళపర్తి-మన్నెవారిజలాల్‌పూర్ రోడ్డు

న్యూస్‌టుడే, వెల్దుర్తి: చాలా రహదారులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. రోడ్లపై ధాన్యం ఎండబెట్టడం, శిథిలమైన దారులు, ఇరుకైన వంతెనలు, కల్వర్టులు, రోడ్లను ఆక్రమించిన పొదలు, చెట్లు, రక్షణ గోడలు లేని వంతెనలు, కల్వర్టులు ఇలా ఎన్నో ఉన్నాయి. ప్రమాదకరమైన మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో పాటు అతివేగం ప్రమాదానికి కారణమవుతున్నాయి. బుధవారం శివ్వంపేట మండలం ఉసిరికపల్లి వద్ద రక్షణ గోడలు లేకపోవడంతో పాటు అతివేగం వల్ల కారు వాగులో పడి ఏడుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. రోడ్లు బాగా లేక తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిల్లో కొందరు గాయపడగా, మరికొందరు మృత్యువాత పడుతున్నారు. ఈ ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రహదారుల మలుపుల వద్ద రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, పీడబ్ల్యూడీ శాఖలవారు సరైన జాగ్రత్తలు చేపట్టక ప్రమాదాలు జరుగుతున్నాయి. వెల్దుర్తి ఉమ్మడి మండలం వ్యాప్తంగా పదుల సంఖ్యలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకుని సూచిక బోర్డులు, రహదారులను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతల మయంగా వెల్దుర్తి-ఎలుకపల్లి రహదారి

ఆయా చోట్ల పరిస్థితి:

వెల్దుర్తి నుంచి జిల్లా కేంద్రం మెదక్‌కు 19 కి.మీ దూరంలో ఎన్నో మలుపులు ఉన్నాయి. ఈ రోడ్డంతా శిథిలం కావడంతో పాటు మలుపులు ఉండడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరెగూడెం-ఉప్పులింగాపూర్ మధ్య హల్దీవాగు వంతెన వద్ద ప్రమాదకరమైన ఎస్ ఆకారం మలుపు ప్రాణాంతకంగా ఉంది. నర్సాపూర్-కుకునూర్ మీదుగా వెల్దుర్తికి గల ప్రధాన రోడ్డు, మంగళపర్తి-మన్నెవారిజలాల్‌పూర్ మధ్య మలుపు ఉండడంతో పాటు ఎత్తైన గుట్టపైకి రోడ్డు ఉండడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం ఇక్కడ కారు బోల్తాపడి వెల్దుర్తికి చెందిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు.

వెల్దుర్తి-యశ్వంతరావుపేట రోడ్డు సరిగా లేకపోవడంతో పాటు పలు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.

- ఉప్పులింగాపూర్-దరిపల్లి మధ్య 3 కి.మీ మార్గంలో అయిదు మలుపులు ఉండడం గమనార్హం. ధర్మారం నుంచి మహ్మద్‌నగర్ తండా వరకు 5 కి.మీ పదికి పైగా మలుపులు ఉన్నాయి. వెల్దుర్తి-ఉసిరికపల్లి చౌరస్తా మధ్య పొదలు, చెట్లు దట్టంగా ఉండి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి మలుపుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు, పొదలను తొలగించాలి. అవసరమైన ప్రాంతాల్లో రహదారులను విస్తరించి, రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా వెయిట్ లిఫ్టింగ్ అండర్-17 జట్టు ఎంపికలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా బాల, బాలికల వెయిట్ లిఫ్టింగ్ అండర్-17 ఎంపికలు స్థానిక సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 15మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ తెలిపారు.